

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి చిల్పూరు మండలం రాజవరానికి చెందిన మామిడాల చైతన్య. ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందాడు. అయితే జ్వరం తగ్గకపోవడంతో స్టేషన్‌ఘన్‌పూర్ పీహెచ్‌సీలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగ్గా ఉందని, ఆస్పత్రిలో వైద్యసేవలు పరవాలేదని చెపుతున్నాడు. పేరుకే పెద్దాస్పత్రిగా ఉందని, బెడ్‌ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువతి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన అఖిల. మూడు రోజులుగా జ్వరం, తలనొప్పిగా ఉంటే ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. రక్త పరీక్షలు చేస్తే డెంగీ జ్వరంగా గుర్తించారు. మూడు రోజుల నుంచి పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు.

మంచం పట్టిన గ్రామాలు

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- ప్రబలుతున్న విషజ్వరాలు
- డివిజన్ వ్యాప్తంగా 32 డెంగీ కేసులు
- విషజ్వరాలతో ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఘన్‌పూర్ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు



పీహెచ్‌సీలో ఓపీ వద్ద ప్రజలు



రక్త పరీక్షల కోసం క్యూలో ఉన్న రోగులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్థంగా మారడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండగా ముందస్తుగా అధికారులు ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో గ్రామాల్లో మెజార్టీ ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలతో జనాలు విలవిలలాడుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా గ్రామాల్లో ఇంటికొకరు చొప్పున జ్వరాల బారిన పడగా గ్రామాల్లో నిర్లిప్త వాతావారణం కనిపిస్తుంది. ఏ ఇంటికి వెళ్లినా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. వైద్య చికిత్స కోసం ప్రజలు ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో అరకొర సౌకర్యాలు, బెడ్‌ల కొరతతో పేదలైన రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఘన్‌పూర్ పీహెచ్‌సీలో సరిపడా బెడ్‌లు లేక ఒక్కొక్క బెడ్‌పై ఇద్దరిని పడుకోబెడుతున్నారు.

ఘన్‌పూర్ డివిజన్‌లో 32 మందికి డెంగీ

ప్రస్తుత సీజనల్‌లో ఘన్‌పూర్ డివిజన్ వ్యాప్తంగా 32 మంది డెంగీ వ్యాధి బారిన పడ్డారని వైద్యులు చెపుతున్నారు. ఘన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలో స్టేషన్‌ఘన్‌పూర్, తాటికొండ, ఇప్పగూడెం, మల్కాపూర్, కూనూర్, జఫర్‌గఢ్, పాలకుర్తి, కొడకండ్ల మొత్తం 8 పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటివరకు 32 మందికి డెంగీ వ్యాధి సోకింది. డివిజన్ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో పీహెచ్‌సీలలోకి వస్తున్న రోగులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని ఆస్పత్రుల్లో గతంతో పోలిస్తే ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఘన్‌పూర్ పీహెచ్‌సీలో సాధారణ రోజుల్లో రోజుకు ఓపీ 100 వరకు ఉండగా ప్రస్తుతం రోజుకు ఓపీ దాదాపు 200 వరకు ఉంటోంది. ఆస్పత్రుల్లో ఓపీ వద్ద, రక్తపరీక్షలు చేసే వద్ద, మందులు తీసుకునే కాడ రోగులు కిక్కిరిసి కనిపిస్తున్న తీరు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది. ఘన్‌పూర్ డివిజన్ పరిధిలోని వివిధ పీహెచ్‌సీలలో గత రెండువారాల్లో ఓపీ 10,861 మంది కాగా, ఇన్‌పేషెంట్లు 1,177 మంది ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

గత పదిహేను రోజుల్లో పీహెచ్‌సీల్లో ఓపీ, ఐపీ వివరాలు

పీహెచ్‌సీలు	ఓపీ	ఐపీ
స్టేషన్‌ఘన్‌పూర్	2,113	501
ఇప్పగూడెం	789	3
తాటికొండ	888	7
మల్కాపూర్	878	10
కూనూర్	845	29
జఫర్‌గఢ్	2,206	209
పాలకుర్తి	2,020	368
కొడకండ్ల	1,122	50
మొత్తం	10,861	1,177

ఏ వార్డు చూసినా జ్వరపీడితులే..

డివిజన్ వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లుగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లోపంతో రోజురోజుకు విషజ్వరాలు ప్రబలుతుండగా ఏ వార్డులో చూసినా జ్వర పీడితులు కనిపిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడం, పారిశుద్ధ్య సమస్యను పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడం, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దాదాపు అన్ని గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. జిల్లావ్యాప్తంగా రోజురోజుకు డెంగీ కేసులు, విషజర్వాలు పెరుగుతుండగా గ్రామంలో పారిశుద్ధ్య లోపంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



ఇప్పగూడెంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలి. ఇళ్ల పరిసరాల్లో కొబ్బరి బొండాలు, పాత కుండలు, పెంకులు, టైర్లు లేకుండా చూసుకోవాలి. గోలాల్లో నీటిని ప్రతీరోజూ పూర్తిగా పారబోసి పట్టుకోవాలి. లేనిపక్షంలో పాచినీళ్లలో దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయి. గ్రామాల్లో నాలాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఎవరికైనా జ్వర లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందకుండా ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ సుధీర్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

డబుల్‌రోడ్డు నిర్మించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురం ఎక్స్ రోడ్డు నుంచి తానేదార్‌పల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం మంగళవారం అందజేశారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, కాంగ్రెస్ నాయకులు దుంపల పద్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, గాదె చంద్రయ్య, లింగారెడ్డి, కృష్ణంరాజు, కుమారస్వామి, రాజు, రమేష్, ప్రసాద్, నర్సయ్య, సుధాకర్, నవీన్, దయాకర్, అరుణ్, చిరంజీవి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిదిలో శ్రావణ మాసం చివరి మంగళవారం పురస్కరించుకుని భక్త జనసందోహం నడుమ ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా స్వామివారికి ప్రత్యేక సేవలు నిర్వహించారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఊయల సేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు, సిబ్బంది జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, కృష్ణ, లక్ష్మి, వసంత, స్వరూప, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణ

ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా రాత్రి శ్రీకృష్ణ ఊయల సేవలో భాగంగా చిన్నారులు కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. కాగా, ముత్తినేని వేంకటేశ్వరు కృష్ణుడి అలంకరణ సెట్టుకు, రామకృష్ణారావు రూ. 12 వేలు, సందీప్‌రెడ్డి రూ. 6వేలు, రాంబాబు రూ. 5వేలు, చందు పూజాసామగ్రి, గణేష్‌రెడ్డి అరటి పళ్లు, ఉద్దమారి అనిల్‌కుమార్ పుష్పాలంకరణకు రూ. 2వేలను ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబుకు అందజేశారు.

కృష్ణాష్టమి వేడుకలు

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కత్తుల జితేందర్, సోమన్నలు ఉట్టి కొట్టి బహుమతిని గెలుపొందారు. జీపీ కార్యదర్శి వెంకటేశ్వరా చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యం కోసం సాయం



పాలకుర్తి: పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన పెంతల అశోక్ హనుమకొండలో చికిత్స పొందుతున్న కీర్తన వైద్యం కోసం రూ.19,800 సాయం మంగళవారం అందజేశారు. పరకాలకు చెందిన సారయ్య–పుష్పలత కుమార్తె కీర్తన నాలుగు రోజులుగా హనుమకొండ అమృత ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్సకు రూ.70 వేలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. కాగా, కానిస్టేబుల్ అశోక్ తన మిత్రులు, సన్నిహితుల ద్వార సేకరించిన డబ్బును అందజేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ వేణు, అరుణ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

భరత నాట్యంలో చిన్నారుల ప్రతిభ



పాలకుర్తి టౌన్: భరత నాట్యంలో పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఆర్యన్ శాస్త్ర డ్యాన్స్ స్కూల్ చిన్నారులు మంగళవారం కీర్తి అకాడమీ ఆధ్వర్యంలో స్వర్ణగిరిలో జరిగిన నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు ఫంక్షన్‌లో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన చిన్నారులను డ్యాన్స్ స్కూల్ నిర్వాహకురాలు పాము సౌమ్య, తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసిన నాయకులు

పాలకుర్తి టౌన్: అమెరికా నుంచి వచ్చిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరు యాకయ్య మాట్లాడుతూ విద్యార్థులకు గొడుగుల పంపిణీ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను కోరగా ఆమె అంగీకరించినట్లు తెలిపారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పులి గణేశ్, సలేంద్ర శ్రీనివాస్ ఉన్నారు.

జిల్లా ఆస్పత్రికి జ్వరపీడితుల తాకిడి



వరండాలో రోగులకు ఏర్పాటు చేసిన బెడ్లు

జనగామ: జిల్లా ఆస్పత్రికి జ్వర పీడితుల తాకిడి పెరిగింది. ఇటీవల కాలంలో డెంగీ, వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలోని జనరల్ వార్డుల్లో అడ్మిట్ పేషెంట్ల సంఖ్య పెరగడంతో.. బెడ్లు ఖాళీ లేక వరండా ఆవరణలో ట్రీట్‌మెంటు చేస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే ఓపీలో 520 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా, 129కి జ్వరం ఉందని నిర్ధారించారు. ఇందులో సుమారు 25 మందికి పైగా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది శ్రమిస్తూ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



చెక్కు అందజేస్తున్న ఎంపీ కడియం కావ్య

జఫర్‌గఢ్: సీఎం సహాయ నిధి పేదలకు వైద్య పరంగా ఎంతో భరోసానిస్తున్నదని ఎంపీ కడియం కావ్య అన్నారు. మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన కొంతం చంద్రయ్య మనువరాలు శివానికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్కును ఎంపీ హనుమకొండలోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. మారపల్లి ప్రభాకర్, కొంతం నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లను ఏర్పాటు చేయిస్తున్న సీఐ, ఎస్సై

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే నిడిగొండ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేగం కాదు ప్రాణం మిన్నగా ప్రయాణం చేయాలన్నారు. అతివేగంతో వెళ్లే వారు తమ వేగం తగ్గించుకోవాలన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేష్, సిబ్బంది ఉన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత సమాజంలో బాలికలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలని మహిళా సాధికారిత స్పెషలిస్టులు పవిత్ర, హేమలత అన్నారు. జిల్లా మహిళా సాధికారిత వారి ఆధ్వర్యంలో ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్, నమిలిగొండ శివారు ప్రభుత్వ మైనార్టీ పాఠశాలలో బాలికలకు మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యావిధానం, మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులను వివరించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



లీకేజీని చూపుతున్న నాయకులు

జనగామ: పట్టణంలోని 3వ వార్డులో 15 రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిగ గోపి ఆధ్వర్యంలో మంగళవారం కాలనీని సందర్శించారు. ప్రతి ఇంటికి సరఫరా చేసే నీటి పైపులైన్ లీకేజీ అవుతూ కలుషితంగా మారిపోతున్నా పట్టించుకోక పోవడం బాధాకరమన్నారు. లీకేజీ నీరు రివర్స్‌లో పైపులైన్ లోకి వెళ్లి తిరిగి అవే వస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

నాయీబ్రాహ్మణులు ఏకం కావాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జఫర్‌గఢ్: సమస్యల పరిష్కారం కోసం నాయీబ్రాహ్మణులు ఏకం కావాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల శ్రీరాం కోరారు. స్థానిక రామాలయం వద్ద మండలస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నాయీబ్రాహ్మణులు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అనంతరం సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన శ్రీరాముల నవీన్ సంఘం మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా సింగారపు యాకయ్య, కోశాధికారిగా కొలిపాక రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిప్పారపు యోగేశ్వర్‌తో పాటు తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు. నాయకులు రఘుపతి, వెంకటేష్, ప్రభాకర్, అభినాష్, సత్యం, కృష్ణ, వేణు, వీరస్వామి అనంద్, కుమార్, రాజు, సత్తయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



‘మురుగు’లో తాగునీటి పైపులైన్

మండలంలోని దేశాయితండా పంచాయతీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ చుట్టూ మురుగు నీరు నిలుస్తోంది. దీంతో ఇటీవల గ్రామ పంచాయతీ అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేరని కాలనీవాసులు వాపోతున్నారు. ఒకవేళ పైపులైన్ లీకేజీ అయితే మురుగునీరు తాగునీటితో కలిసి కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– చిల్పూరు

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
ఎన్నకూస రాజు, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9963460546

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఆశలు, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌టీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కూర వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆయన వారితో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో సీఎం సలదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతి అందజేశారు. ధర్నా శ్రీదేవి, రజిత, మైముద, శ్రీలత, మంజుల, రాజమణి, ప్రేమలత, కవిత తదితతులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోని..

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు కోరారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతికి మంగళవారం అందజేశారు. కుమార్, రాజు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డినగర్ గ్రామానికి చెందిన కాలియా శాంతమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా, గ్రామానికి చెందిన గొడుగు సతీష్, సందీప్ మృతురాలి భర్త చిట్టిబాబును మంగళవారం పరామర్శించి బియ్యం అందజేశారు. గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని కట్కూర్ గ్రామంలో మృతి చెందిన బొడ్డు కర్ణాకర్ కుటుంబ సభ్యులను చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి మంగళవారం పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. మృతుడి పిల్లల చదువుకు సహాయ పడుతానని హామీ ఇచ్చారు.

వాహనాల తనిఖీ

దేవరుప్పుల : జనగామ–సూర్యాపేట రహదారిలో పోలీసులు బారిక్రేడ్లను ఏర్పాటు చేసి మంగళవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఊర సృజన్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల గంజాయి వంటి మత్తు పదార్థాలతోపాటు చైన్‌స్నాచింగ్, అపరిమిత వేగంతో వాహనదారులు రోడ్డు నిబంధనలు విస్మరిస్తున్న తరుణంలో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

గవర్నర్ గారూ.. సమస్యలు ఆలకించండి

- వాట్సప్‌లో వైరల్



ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

జనగామ: గ్రామంలో ఎన్నో సమస్యలు.. పెండింగ్‌లో అభివృద్ధి పనులు.. మీ రాకతో మా దశ మారుతుందని సగటు గ్రామ వాసులుగా ఆశిస్తున్నాం అంటూ జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ పేరిట వాట్సప్ గ్రూపుల్లో పోస్టు వైరల్‌గా మారింది. మా ఊరికి వస్తున్న మీరు.. వార్డుల్లో పర్యటించి ఇక్కడి ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. జనగామ నుంచి సిద్దిపేట వెళ్లే ప్రధాన రహదారిని ఇండస్ట్రియల్ కారిడార్ చేసి గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు.

సమస్యలు ఇలా..

ఓబుల్ కేశ్వాపూర్ నుంచి బచ్చన్నపేట మండలం చిన్నరామంచర్ల వరకు మూడు కిలో మీటర్లు, పెద్ద రామంచర్ల నుంచి ఆలేరు మండలం రాఘవపూర్ వరకు నాలుగు కిలో మీటరు, గ్రామం నుంచి తమ్మడపల్లికి బీటీ రోడ్డు నిర్మాణం చేయాలి. శతాబ్ద చరిత్ర కలిగిన పోచమ్మ టెంపుల్ దీనావస్థ స్థితిలో ఉంది. పునర్నిర్మాణం కోసం రూ.50లక్షల నిధులు, టెంపుల్‌కు చేరుకునే దారిలో బీటీ కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాలి. గ్రామంలో మిగిలిన అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.2కోట్లు విడుదల చేయాలి. గ్రామంలోని పీహెచ్‌సీ సెంటర్ 10 గ్రామాలకు సెంటర్ పాయింట్‌గా ఉంది. ఇద్దరు డాక్టర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బందిని నియమించి, 24 గంటల పాటు వైద్య సేవలు అందించే విధంగా చూడాలి. వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ ఊరి ప్రజలు తరుచూ పాము, తేలుకాటుకు గురవుతూ జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారు. వైద్యం ఆసల్యమైతే చనిపోతున్నారు. ఇందుకు సంబంధించిన మందులను గ్రామంలోని పీహెచ్‌సీలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతీ, యువకులు పోటీ పరీక్షలు ప్రిపేర్ అయ్యేందుకు గ్రంథాలయం, ప్రభుత్వ బడిలో అదనపు తరగతి గదులు, డిజిల్ క్లాసులు, మినీ స్టేడియం, పశుసంవర్థక శాఖ ఆస్పత్రి భవనం కూల్చి వేసి నూతనంగా నిర్మించాలి. ఓబుల్ కేశ్వాపూర్ గ్రామానికి ఈ నెల 29న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక నేపథ్యంలో గ్రామ అభివృద్ధి కమిటీ పేరిట సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సమస్యల చిట్టా జిల్లాలో చర్చ నీయాంశంగా మారింది.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సృజన్‌కుమార్

దేవరుప్పుల: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ ఉత్సవాల నిర్వహణ తీరు, ప్రభుత్వ నిబంధనలకు తోడ్పాటు వంటి అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. నిర్దేశింత మంటపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి శాఖపరంగా పర్యవేక్షణ ఉండేలా సహకరించాలన్నారు. ఏఎస్సై సదానందం, హెచ్‌సీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గద్దె తొలగింపుపై ఫిర్యాదు

స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్ గ్రామంలో దళిత సంఘాలు, ఎస్సీలు ఏర్పాటు చేసుకున్న బీఆర్ అంబేడ్కర్ జెండా గద్దెను గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా తొలగించారని, వారిపై చర్య తీసుకోవాలని సింగపురం ఏలియా, ఏడెల్లి శివ తదితరులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు ఉద్దేశ్యపూర్వకంగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గద్దెను తొలగించారని వారు వాపోయారు. ఈ విషయమై అడిగితే కులం పేరుతో దూషిస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. సలీమ్, సందీప్ పాల్గొన్నారు.

కవితకు బెయిల్‌పై హర్షం

బచ్చన్నపేట: లిక్కర్ పాలసీ కేసులో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంతో మండల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంబంధం లేని కేసులో కవితను జైలులో ఉంచారని అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, వైస్ చైర్మన్ రాధ, ఇర్రి రమణారెడ్డి, చెంద్రారెడ్డి, కృష్ణంరాజు ఉన్నారు.

సంబురాలు

చిల్పూరు: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు పట్ల మండలంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ జనగాం యాదగిరి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కృష్ణారెడ్డి, మనోజ్‌రెడ్డి, మాధవరెడ్డి, అశోక్, రవిచంద్ర, క్రాంతి ఉన్నారు.

‘హైడ్రా’ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలి

పాలకుర్తి: హైదరాబాద్‌లోని కుంటలు, చెరువులను ఆక్రమించుకొని నిర్మించిన భవనాలను కూల్చి వేస్తున్న హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా కన్వీనర్ కాసోజు బ్రహ్మాచారి అన్నారు. మంగళవారం ఆయన పాలకుర్తిలో మాట్లాడారు. కబ్జా చేసిన పేదల భూములను కాపాడి వారికి అప్పజెప్పాలని ఆయన కోరారు.

రేణుకా ఎల్లమ్మ బోనాలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని మోడల్ కాలనీలో శ్రీరేణుకా ఎల్లమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కాలనీ శివారులోని ఎల్లమ్మతల్లి గుడి వద్దకు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

కాంగ్రెస్ నుంచి కృష్ణమూర్తి సస్పెన్షన్

దేవరుప్పుల: పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలతో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తిని పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు పార్టీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్ జి.చెన్నారెడ్డి పేరిట ఉత్తర్వులు లేఖ మంగళవారం రాత్రి సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ అయింది. మే నెలలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి.. పెద్ది కృష్ణమూర్తిని పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించి నల్ల శ్రీరాములును నియమించింది విదితమే. నాటి నుంచి పార్టీలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో టీపీసీసీ ఆధ్వర్యంలో సస్పెన్షన్‌కు దారి తీయడం సర్వత్రా చర్చంశానీయంగా మారింది.